గ్యాస్ సిలిండర్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కవాడిగూడ: వంటగదుల్లో సంభవించే గ్యాస్ సిలిండర్లు లీకేజీలు తద్వారా అగ్ని ప్రమాదాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని ముషీరాబాద్ అగ్నిమాపక స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి.వెంకటేశ్వర్ సూచించారు. శుక్రవారం కవాడిగూడలోని ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర విపత్తు స్పందన అగ్నిమాపక సేవల శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు సిలిండర్ లీకేజీ, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగే అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ముషీరాబాద్ ఫైర్ స్టేషన్ సీఐ వెంకటేశ్వర్, తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారిగోవర్ధన్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి, అగ్ని మాపక సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మహిళలు వంట చేస్తున్న సమయంలో వంటగదిని విడిచిఎవెళ్లరాదని సూచించారు. రోజూ పడుకునే ముందు సిలిండర్‌ను ఆఫ్ చేయాలని వంటగదిలో ఫ్రిడ్జి లేకుండా చూసుకోవాలన్నారు. తద్వారా అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని వారు స్పష్టం చేశారు. అగ్నిమాపక సిబ్బంది ఎస్. సాజిద్‌కుమార్, దస్తగిరి, వంశీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెండు లక్షల ఓట్ల మెజార్టీతో కిషన్‌రెడ్డి గెలుపు తథ్యం

గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

చిక్కడపల్లి: సికింద్రాబాద్ లోకసభ స్థానం బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి 2 లక్షల ఓట్ల మెజార్టీతో గెలుపొందడం తథ్యమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ అన్నారు. కిషన్‌రెడ్డి శుక్రవారం నామినేషన్ దాఖలు చేసిన సందర్భంగా ఆయన ఉజ్జయిని మహంకాళీ ఆలయంలో పూజలు నిర్వహించారు. గాంధీనగర్ డివిజన్ నుంచి కార్పొరేటర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు ర్యాలీగా మహంకాళి దేవాలయానికి వెళ్లారు. అక్కడినుంచి నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ పావని మాట్లాడుతూ... కిషన్‌రెడ్డిని గెలిపించేందుకు ఓటర్లు నిర్ణయించారని ఆయన గెలుపును ఎవరూ అడ్డుకోలేరని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని



ర్యాలీగా వెళ్తున్న కార్పొరేటర్, బీజేపీ నేతలు

బీజేపీ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్ అన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుపొందడం ఖాయమని జోస్యం చెప్పారు. నేతలు రత్నసాయిచంద్, సురేందర్, దామోదర్, శ్రీకాంత్, వీఎస్టీ రాజు, నర్సింహా, శ్రీనివాస్, సాయి, ఉమేష్, యాది పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు సిబ్బంది

చిక్కడపల్లి: రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ నిర్భయంగా వినియోగించుకొని మంచి వ్యక్తులను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోవాలని సూచిస్తూ చిక్కడపల్లి పోలీసులు శుక్రవారం సాయంత్రం స్టేషన్ పరిధిలోని పలు కీలక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. చిక్కడపల్లి పీఎస్ సిబ్బందితోపాటు ప్రత్యేక బృందాలు ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్నాయి. ఇన్‌స్పెక్టర్ సీతయ్య, ఎస్‌ఐలు కోటేశ్వర్‌రావు, శిపాల్‌రెడ్డి, మౌనిక నేతృత్వం వహించారు. గోల్కొండ చౌరస్తా వద్ద ప్రారంభమైన ఫ్లాగ్‌మార్చ్ నాగమయ్యకుంట, అజామాబాద్ క్రాస్ రోడ్, అచ్చయ్యనగర్, మూసీకేఫ్, సూర్యానగర్, చిక్కడపలి మొయిన్‌రోడ్డు, బాపూనగర్, వివేక్‌నగర్, హనుమాన్‌టెంపుల్ లేన్ ప్రాంతాల్లో దాదాపు ఐదు కిలోమీటర్లమేర కొనసాగింది.

ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించాలి: ఏఐఎస్‌ఎఫ్

హిమాయత్‌నగర్: రాష్ట్రంలో ఉన్న అన్ని ప్రభుత్వ విద్యాసంస్థలకు 2024–25 విద్యా సంవత్సరానికి ముందే సొంత పక్కా భవనాలు, మరమ్మతులు, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో పాఠశాల విద్యా శాఖ జాయింట్ సెక్రటరీ ఎస్.పుల్లారావును శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల నూతన పక్కా భవనాలకు, మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ నెల 24 నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు ఉన్నందున.. వేసవి సెలవులు పూర్తయ్యేలోపు ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులను పూర్తి చేస్తే 2024 విద్య సంవత్సర విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఫీజుల



పాఠశాల విద్యా శాఖ జాయింట్ సెక్రటరీకి వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ ప్రతినిధులు

నియంత్రణ చట్టాన్ని రూపొందించి, అమలు చేయాలని, ప్లేస్కూల్, ఎల్కేజీ, యూకేజీ, మొదటి తరగతి నుంచి పదో తరగతి వరకు..డొనేషన్లు, అభివృద్ధి చార్జీలు, ఫీజులతో పాటు పుస్తకాలు, దుస్తులు, బూట్లు, బెల్టుల పేరిట తల్లిదండ్రుల జేబులకు భారీగా చిల్లులు పెడుతున్నాయని ఆరోపించారు. ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో ఫీజుల నియంత్రణ చట్టం కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యావేత్తలు, బాలల సంఘం ఆధ్వర్యంలో సమీకరించి పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మర్రి శ్రీమాన్ పాల్గొన్నారు.

మే 15 నుంచి రైతాంగ సమస్యలపై ఆందోళనలు



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్

అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం

ముషీరాబాద్: రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై మే 15 నుంచి జూన్ మొదటి వారం వరకు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గం నిర్ణయించింది. శుక్రవారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సంఘం అధ్యక్షుడు ఆర్.చంద్రశేఖర్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తెలంగాణ రాష్ట్ర రైతాంగం ఎదుర్కొంటున్న రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై చర్చించి ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిచ్చారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏకకాలంలో లక్ష రూపాయల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి దశల వారిగా వడ్డీలను మాత్రమే మాఫీ చేసి రైతాంగాన్ని మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో రెండు లక్షల రూపాయలను ఏకకాలంలో మాఫీ చేస్తామని వాగ్దానం చేసి నేటికి రుణమాఫీ చేయలేదని గుర్తు చేస్తూ వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేసింది. వ్యవసాయ ఉత్పత్తి సాధనాలు, ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు, పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు, గతంలో 40–60 శాతం సబ్సిడీ ద్వారా ఇచ్చేదని వాటిని సబ్సిడీలను రైతు పెట్టుబడి కింద రైతు బంధు తెచ్చి సబ్సిడీలు మొత్తం రద్దు చేసిందని విమర్శించారు. ఆ సబ్సిడీలను కొనసాగించాలని తీర్మానించారు. ఈ సమస్యల పరిష్కారానికి మే 15 నుంచి జూన్ మొదటి వారం వరకు మండల, జిల్లా కేంద్రాలలో ఆందోళనలు చేపట్టాలని రాష్ట్ర కార్యవర్గ ప్రధాన కార్యదర్శి వి.ప్రభాకర్ పిలుపునిచ్చారు.

న్యూసెన్స్ కేసులో నిందితుడికి ఐదు రోజుల జైలు

బంజారాహిల్స్: అర్ధరాత్రి రోడ్డు పక్కన స్నేహితులతో కలిసి న్యూసెన్స్ చేయడమే కాకుండా ఇదేమిటని అడగడానికి వెళ్లిన పోలీసులను ఎదురు ప్రశ్నించిన యువకుడికి ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. జూబ్లీహిల్స్ ఎస్‌ఐ ఎం.మెహర్ రాకేష్ తెలిపిన వివరాల ప్రకారం... బోరబండకు చెందిన నవీన్(19) శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–5లోని మెట్రోస్టేషన్ సమీపంలో కారులో మ్యూజిక్ ఏర్పాటు చేసుకుని ఇంకో ఏడు మంది స్నేహితులతో కలిసి డ్యాన్స్‌లు చేస్తూ అరుపులు, కేకలు వేస్తూ న్యూసెన్స్‌కు పాల్పడుతుండగా జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కారు టాప్ పైకి చేరుకుని నృత్యాలు చేస్తూ రోడ్డు పైన బీభత్సం సృష్టిస్తుండడంతో పోలీసులు అడ్డుకుని ఇదేమిటని నవీన్‌ను ప్రశ్నించారు. నేను ఎవరో తెలుసా..? ఓ ఛానల్‌లో రిపోర్టర్‌ను అంటూ పోలీసులతో ఎదురుదాడికి దిగారు. దీంతో పోలీసులు నవీన్‌తో పాటు మిగతా ఏడు మందిని స్టేషన్‌కు తీసుకువెళ్లారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన నవీన్ రిపోర్టర్ కాదని, డేటాఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారు. నవీన్‌తో పాటు మరో ముగ్గురిని శుక్రవారం నాంపల్లిలోని పదో ప్రత్యేక మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ మందా మురళి ఎదుట హాజరుపరిచారు. న్యాయమూర్తి కేసు తీవ్రతను గుర్తించి నవీన్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. న్యూసెన్స్‌కు పాల్పడిన వారిలో ముగ్గురు మైనర్లు ఉండగా వారిని జువైనల్ హోమ్‌కు తరలించారు.

బీజేపీ శ్రేణుల్లో జోష్

- కిషన్‌రెడ్డి నామినేషన్‌కు తరలివెళ్లిన నాయకులు, కార్యకర్తలు
- పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ర్యాలీలు



బాగ్ అంబర్‌పేట నుంచి నామినేషన్‌కు తరలివెళుతున్న బీజేపీ నేతలు



అంబర్‌పేట డివిజన్ నుంచి...

అంబర్‌పేట: సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అభ్యర్థిగా కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నామినేషన్ వేసిన నేపథ్యంలో అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. నామినేషన్ వేసేందుకు వెళ్లిన కిషన్‌రెడ్డి వెంట పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. ఈ క్రమంలో శుక్రవారం పలు ప్రాంతాలో పార్టీ కార్యకర్తలు ర్యాలీలు నిర్వహించారు.

- అంబర్‌పేట డివిజన్, బాగ్ అంబర్‌పేట, గోల్నాకల నుంచి ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. సికింద్రాబాద్ మహంకాళీ దేవాలయం నుంచి నామినేషన్ వేసే జోనల్ కార్యాలయం వరకు నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. అంబర్‌పేట నుంచి నాగభూషణం చారి, యశ్వంత్, భిక్షపతి, కృష్ణ ముదిరాజ్, యాదగిరి తదితరులు ఉన్నారు. బాగ్ అంబర్‌పేట నుంచి నాయకులు చుక్క జగన్, అచ్చిని రమేశ్, సురేశ్, కెంచె చంద్రశేఖర్, వెంకటేష్ ముదిరాజ్, గోవర్ధన్‌రెడ్డి, రోహిత్ తదితరులు తరలివెళ్లారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా ర్యాలీ

నల్లకుంట: సికింద్రాబాద్ బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి తమ మద్దతుదారులతో భారీ ర్యాలీ నిర్వహించారు. కిషన్‌రెడ్డికి మద్దతుగా నల్లకుంట నుంచి మాజీ కార్పొరేటర్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు వనం రమేష్ ఆధ్వర్యంలో ర్యాలీగా తరలి వెళ్లారు. ర్యాలీలో బీజేపీ సీనియర్ నాయకులు ఎస్. మహేష్ కుమార్, ఎస్.నర్సింగ రావు, వనం మాలతి, నిఖిల్, సబిత, వీరన్న రమ, రాహుల్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కాచిగూడలో ర్యాలీ...

కాచిగూడ: ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా జి.కిషన్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా కార్పొరేటర్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు, కార్యకర్తలు కాచిగూడలో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేతలు సుభాష్ పటేల్, బి.భీమ్‌రాజ్, ఎస్.రవికుమార్, మల్లికార్జున్, ఆర్.సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి కిషన్‌రెడ్డి ప్రత్యేక పూజలు

అంబర్‌పేట: సికింద్రాబాద్ పార్లమెంటు బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి నామినేషన్ వేయడానికి ముందు సెంటిమెంటుగా అంబర్‌పేట నియోజకవర్గంలో పలు ఆలయాలను సందర్శించారు. శుక్రవారం ఉదయం కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. అంబర్‌పేటలోని మహంకాళీ ఆలయం, డీడీ కాలనీ సాయిబాబాగుడి, నల్లకుంట శంకర్‌మఠ్ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నామినేషన్ దాఖలుకు వెళ్లారు.



మహంకాళీ అమ్మవారిని దర్శించుకుంటున్న కిషన్‌రెడ్డి దంపతులు



నల్లకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ కార్పొరేటర్ వనం రమేష్...



కాచిగూడలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

నియామకం



డాక్టర్ మినాజ్‌కు నియామకపత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ముషీరాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన డాక్టర్ మినాజ్ నియమితులయ్యారు. తన నియామకం పట్ల మినాజ్ హర్షం వ్యక్తం చేస్తు మాజీ పార్లమెంటు సభ్యుడు అంజన్‌కుమార్‌యాదవ్‌కు, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్‌లకు, సికింద్రాబాద్‌జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మోసిన్ ఖురేష, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

ర్యాంకులు రావడం గర్వకారణం: అమిగోస్ అడ్మిన్

చిక్కడపల్లి: ఆలిండియా సివిల్స్ ర్యాంకులు రావడం గర్వకారణంగా ఉందని అశోక్‌నగర్ అమిఘోస్ ఐఏఎస్ అకాడమీ అడ్మిన్ డైరెక్టర్ మంజునాథ్ వెల్లడించారు. సివిల్స్ ఫలితాల్లో అమిగోస్ ఐఏఎస్ అకాడమీకి 11 ర్యాంకులు వచ్చాయి. శుక్రవారం సాయంత్రం అశోక్‌నగర్‌లోని సంస్థ కార్యాలయంలో మంజునాథ్ మాట్లాడుతూ... తమ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారన్నారు. ఆలిండియా ర్యాంకులు 3, 102, 173, 515, 528, 554,575, 703, 775,792,823 ర్యాంకులను తమ విద్యార్థులు సాధించారని తెలిపారు.

ఆర్‌సీ రెడ్డి కోచింగ్ సెంటర్ అంటేనే ఒక బ్రాండ్...

ఆర్‌సీ రెడ్డి ఐఏఎస్ కోచింగ్ సెంటర్ అంటేనే ఒక బ్రాండ్ అని ఆ సంస్థ చైర్మన్ ఆర్.సి.రెడ్డి పేర్కొన్నారు. ఇటీవలి సివిల్స్ ఫలితాల్లో అశోక్‌నగర్‌లోని ఆర్‌సీ రెడ్డి అకాడమీ విద్యార్థులు 26 ఆలిండియా ర్యాంకులు సాధించినట్లు ఆయన తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ... 16, 50, 82, 104, 138,155, 162, 173, 196, 198, 202, 260, 307, 444, 480, 649, 756, 780, 790, 833, 887, 891, 892, 914, 938, 995వ ర్యాంకులను తమ సంస్థలో కోచింగ్ తీసుకున్న అభ్యర్థులు సాధించారని ఇది తమ సంస్థకు ఎంతో గర్వకారణమన్నారు.

ప్రశ్నించే పార్టీలకు మద్దతివ్వాలి

లిబర్టీ: తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలను పోటీ చేస్తామని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వి.కృష్ణ స్వరూప్ పేర్కొన్నారు. దళితులను అణగారిన వర్గాలను మైనార్టీలను మోసం చేస్తున్న బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని ప్రజలకు విన్నవించారు. పార్టీ కార్యాలయంలో పలువురు అభ్యర్థులకు ఆయన బీఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రశ్నించే గొంతులు పార్లమెంటు పంపాలని కోరారు. ప్రధాన రాజకీయ పార్టీలకు ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామని చెప్పారు. గోలి సురేష్‌కు బీఫామ్ అందజేశారు. నాయకులు నక్క దేవేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గిరిజా కల్యాణం

చిక్కడపల్లి: చిక్కడపల్లి బాపునగర్‌లోని శ్రీ రాజరాజేశ్వరి దేవాలయం 40వ వార్షికోత్సవాలలో భాగంగా శుక్రవారం గిరిజాకల్యాణం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా భక్తులు ఉదయం అగ్నిగుండ ప్రవేశం చేశారు. ఆంధ్రప్రదేశ్ తూర్పు గోదావరి జిల్లాలోని శ్రీ విద్యాపీఠం ఉత్తర పీఠాధిపతులు శివశ్రీ దత్తకార్తికేయ దేవర ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవార్లకు శోభాయాత్ర నిర్వహించారు.



నుగ్రహభాషణం చేస్తున్న శివశ్రీ దత్తకార్తికేయ దేవర, భక్తులు

ఆలయ ప్రధాన అర్చకులు ఆనందస్వామి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

19, 20వ తేదీలలో జాతీయ సదస్సు

ముషీరాబాద్: వివేకానంద డిగ్రీ ప్రభుత్వ కళాశాలలో పరస్పర ఆధారిత భౌతిక, గణిత శాస్త్రాల్లో ఇటీవలి పురోగతులు అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు కళాశాల డాక్టర్ జి.సుకన్య తెలిపారు. 19వ తేదీ ఉదయం ప్రారంభమైయ్యే ఈ సదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతినిధులు పాల్గొని వారి పరిశోధన పత్రాలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ డి.కరుణసాగర్ పాల్గొంటారన్నారు. ప్రత్యేక వక్తలుగా ఆంధ్రప్రదేశ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పి.బాబు పరిచయ ఉపన్యాసంతో పాటు భౌతిక శాస్త్ర రంగంలో జరుగుతున్న పరిణామాలపై పేపర్ ప్రజెంటేషన్ చేస్తారన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత అబ్రహం, సదస్సు కన్వీనర్లు జె.చిన్నబాబు, డాక్టర్ మల్లీశ్వరీ, బి.విజయ నిర్మల, ఎల్.విష్ణుప్రియలతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారంటూ మోసం

హిమాయత్‌నగర్: ఫెడెక్స్ కొరియర్ పేరుతో కాల్ చేసి అక్రమ లావాదేవీలు, మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారంటూ ఓ మహిళ ఉద్యోగినిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు... నగరానికి చెందిన ఓ ప్రైవేట్ మహిళ ఉద్యోగినికి ఫెడెక్స్ కొరియర్ పేరుతో సైబర్ నేరగాళ్లు కాల్ చేశారు. కస్టమ్స్ నుండి ఆమెకు చెందిన పార్శిల్ తిరిగి వచ్చిందని, అందులో ముంబయి నుంచి థాయ్‌లాండ్‌కు తన పేరు మీద పార్శిల్ బుకింగ్, తన ఆధార్ కార్డ్ పేరుతో అక్రమ లావాదేవీలు జరిగాయని తెలిపారు. అనంతరం ముంబై సైబర్ క్రైమ్ పోలీసుల పేరుతో స్కైప్‌లో వీడియో కాల్ వచ్చింది. తన అకౌంట్ స్టేట్‌మెంట్‌ను వెరిఫై చేయాలంటూ వివిధ కారణాలు చెప్పి ఆమె బ్యాంక్ వివరాలను తీసుకున్నారు. అనంతరం తన ఆధార్ కార్డ్‌తో 6.8 మిలియన్ల మనీ లాండరింగ్ కేసు నమోదైందని భయపెట్టారు. ఈ విధంగా బాధితురాలి నుంచి మొత్తం రూ. 5,14,588 (ఐదు లక్షల పద్నాలుగు వేల, ఎనిమిది వందల ఎనభై ఎనిమిది) కాజేశారు. ఇది మోసమని గ్రహించి బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

పాయింట్ రిడీమ్ పేరుతో మోసం...

మరోకేసులో నగరానికి చెందిన ఓ గృహిణి నంబర్‌కు సైబర్ నేరగాళ్లు మెసేజ్ చేశారు. తనకు చెందిన ఆక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు పాయింట్స్ రిడీమ్ చేసుకోవాలంటూ ఓ లింక్ ఆ మెసేజ్‌లో వచ్చింది. అది నమ్మిన బాధితురాలు లింక్ ఓపెన్ చేసి తన క్రెడిట్ కార్డ్ వివరాలు ఎంటర్ చేసింది. క్షణాల్లో తన క్రెడిట్ కార్డు నుంచి రెండు విడతలుగా రూ. 1.79 లక్షలు డెబిట్ అయ్యాయి.

చోరీ కేసులో వ్యక్తికి నాలుగు నెలల జైలు శిక్ష

కాచిగూడ: దొంగతనం కేసులో ఓ దొంగకు కోర్టు నెలల కఠిన కారాగార శిక్ష విధించిందని కాచిగూడ అడ్మిన్ ఎస్‌ఐ సుభాష్ తెలిపారు. వివరాలివీ... కోఠిలో నివాసం ఉంటూ ప్రైవేట్ జాబ్ చేస్తున్న విల్సన్ (38) కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023లో దొంగతనం చేశారు. అతని పై ఆరోజు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ శుక్రవారం వచ్చింది. నాంపల్లి కోర్టు జడ్జి దొంగకు నాలుగు నెలల కఠిన కారాగార శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దొంగను అదుపులోకి తీసుకుని జైలుకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన డ్రైవర్ అరెస్ట్

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కారు డ్రైవర్‌ను కాచిగూడ పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అడ్మిన్ ఎస్‌ఐ సుభాష్ సమాచారం మేరకు... బర్కత్‌పురలోని ఓ అపార్ట్‌మెంట్ లిఫ్ట్‌లో వెళ్తుండగా కారు డ్రైవర్ అబ్బయ్య(29) మైనర్ బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ బాలిక తల్లికి చెప్పడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అబ్బయ్యపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించుకుందాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: అంబర్‌పేటలో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థికి మెజార్టీ వచ్చేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కోరారు. శుక్రవారం గోల్నాక డివిజన్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించి పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన పద్మారావుగౌడ్‌ను గెలిపించేందుకు అంతా కలిసి పనిచేయాలని ఎమ్మెల్యే అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీని ఎంతో ఆదరించారని తిరిగి అలాంటి ఆదరణ పొందలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు కొమ్ము శ్రీనివాస్, భూపతి లక్ష్మణ్, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

'మెజీషియన్స్' అసోసియేషన్ ఆవిర్భావం



లోగో ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: యువ తెలంగాణ మెజీషియన్స్ అసోసియేషన్ శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిర్భావమైంది. అసోసియేషన్‌కు సంబంధించిన లోగోను గౌరవ అధ్యక్షుడు చొక్కారపు వెంకటరమణ ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా సీరంగం ప్రవీణ్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారిగా గుమ్మడివెల్లి శ్రీకాంత్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ... 15 సంవత్సరాల క్రితం మెజీషియన్స్‌కు సరైన గుర్తింపు, ఆదరణ లేదన్నారు. ప్రస్తుతం మెజీషియన్స్‌ను గుర్తించి గౌరవిస్తున్నారని తెలిపారు.

సీతారాములకు విశేష పుష్పార్చన



నల్లకుంట: న్యూనల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ఈ నెల 13న ప్రారంభమైన సీతారాముల కల్యాణ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఏడోరోజైన శుక్రవారం ఉదయం సీతారాములకు సుప్రభాతసేవ, ఉపనిషత్ పూర్వక అభిషేకం చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలతో అలంకరించి అర్చక స్వాముల మంత్రోచ్ఛరణల నడుమ 'విశేష పుష్పార్చన (లక్ష పుష్పార్చన)' చేశారు. ఈ నెల 21తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ఈవో తెలిపారు.

కిషన్‌రెడ్డి తెలంగాణకు చేసిందేమీలేదు: సీపీఎం



మాట్లాడుతున్న సీపీఎం నేత మహేందర్


అంబర్‌పేట: తెలంగాణకు కేంద్ర మంత్రిగా కిషన్‌రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిలేదని సీపీఎం అంబర్‌పేట నియోజకవర్గ కన్వీనర్ మహేందర్ ఆరోపించారు. శుక్రవారం అంబర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకుడు దశరథ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ప్రైవేటు సంస్థలతో రోడ్లు నిర్మించి వారికే ప్రజల నుంచి ట్యాక్స్ వసూలు చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం చెప్పిందన్నారు. ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చి అభివృది చేసిన అని కేంద్ర మంత్రి ప్రజలకు నివేదిక పేరిట మయమాటాలు చెప్పడం విడ్డూరం అని ఆయన వ్యాఖ్యానించారు.

మజ్జిగ కేంద్రానికి విశేష స్పందన



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాత వాకర్స్ క్లబ్ నల్లకుంట, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో వీఎస్‌టీ రోడ్‌లోని అమ్మవారి ఆలయం వద్ద నిర్వహిస్తున్న మజ్జిగ కేంద్రం, చలివేంద్రానికి విశేష స్పందన లభిస్తున్నది. వేసవిలో నిత్యం సుమారు 800 వరకు ప్రజలు తమ దాహార్తిని తీర్చుకుంటున్నట్లు మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు తెలిపారు. శుక్రవారం మజ్జిగ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రేఖ జహూర్‌ఖర్, వెంకట్ తదితరుల నుంచి ఆర్థిక సాయాన్ని తీసుకున్నారు. సలహాదారులు కేశవరావు దేశ్‌పాండే, లయన్ ఛాయాకులకర్ణి, శ్రీదేవి, ఉపాధ్యక్షులు వెంకట్, లయన్ సీతా తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకరంగా లివర్ సంబంధ వ్యాధులు



ఖైరతాబాద్ పెరుగుతున్న లివర్ సంబంధిత వ్యాధులు ఆందోళన కల్గించేవిగా ఉన్నాయని.. ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందిస్తే లివర్ కేన్సర్, లివర్ సిర్రోసిస్ వంటి ప్రమాదకర పరిస్థితులకు దారితీయకుండా జాగ్రత్త పడవచ్చని పలువురు వైద్య నిపుణులు పేర్కొన్నారు. లక్డీకాపూల్‌లోని గ్లెనిగల్స్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రతిజ్ఞ చేయడంతో పాటు సైక్లథాన్, వాకథాన్ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్లెనిగల్స్ హాస్పిటల్స్ సీసీఈఓ డాక్టర్ నాగేశ్వరావు మాట్లాడుతూ... గ్లెనిగల్స్ హాస్పిటల్లో 1000కి పైగా లివర్ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించామన్నారు. సీనియర్ హెపటాలజిస్ట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ చందన్‌కుమార్ మాట్లాడుతూ... లివర్ సంబంధ వ్యాధులకు ప్రధానంగా ఆల్కాహాల్, ఫ్యాటీలివర్, ఊబకాయం వంటి కారణాలు ప్రధానంగా చెప్పవచ్చన్నారు. చాలా మంది ఫ్యాటీలివర్‌ను నిర్లక్ష్యం చేయడం వల్లే సిర్రోసిస్ బారిన పడుతున్నారని తెలిపారు. రెగ్యులర్‌గా లివర్ చెకప్‌లు చేయించుకుంటూ ఫ్యాటీ లివర్ నుంచి కాపాడుకోవాలని లివర్ ట్రాన్స్‌ప్లాంట్ అండ్ హెచ్‌పీబీ సర్జన్ డాక్టర్ అమర్‌నాథ్ తెలిపారు. హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో సైక్లథాన్, ప్రజలు, డాక్టర్లతో కలిసి వాకథాన్‌లను నిర్వహించారు. వాకథాన్‌ను సైఫాబాద్ ట్రాఫిక్ ఏసీపీ సంజయ్‌కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం హాస్పిటల్‌లో లివర్ మార్పిడి చేయించుకొని ఆరోగ్యవంతమైన జీవితం సాగిస్తున్న వారిని గ్లెనిగల్స్ హాస్పిటల్స్ యాజమాన్యం సత్కరించింది. ట్రాన్స్‌ప్లాంట్ అనస్థీషియాలజిస్టులు డాక్టర్ స్మిత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.